# ప్రైవేటు కంపెనీలకు సిరులు దోచిపెడుతున్న

# ప్రధానమంత్రి ఫసల్ (పంటల) బీమాపథకం

**ప్రధానమంత్రి** మోడి 2016 ఏప్రియల్‌లో ప్రధానమంత్రి ఫసల్ భీమాయోజన అన్న పథకాన్ని ఎంతో ఆర్భాటంతో ప్రారంభించారు. దుస్థితిలో వున్న రైతులను ఆదుకోవటంకోసం యీ పథకాన్ని ప్రారంభించినట్లుగా ఘనంగా ప్రకటించారు. ప్రకృతి వైపరీత్యాలవలనకానీ, దుర్భిక్షం కారణంగాకానీ, పురుగులు-కీటకాలు బారినపడి పంటలు నాశన మవటం వలనగానీ, మరే యితర కారణంవలనకానీ పంటలు నష్టపోయిన రైతాంగాన్ని యీ పథకం ఆదుకొంటుందనీ, తగు నష్టపరిహారం రైతుకు చెల్లింపబడుతుందనీ ప్రకటించారు.

తీరా ఆచరణలో చూస్తే యీ పథకం రైతాంగానికి యిసుమంత కూడా మేలు చేయలేదనీ, నామమాత్రంగా కూడా పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోలేదనీ స్పష్టమవుతోంది. గత ఆర్థిక సంవత్సరాలకాలపు, ప్రకటించబడిన వివరాలు ప్రకారమే యీ చేదు వాస్తవం బట్టబయలయింది. కేంద్రప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వశాఖ ప్రకటించిన వివరాలు ఆ పథకం రైతాంగానికికాక, ప్రైవేటు బీమా కంపెనీలకు బంగరు పంటలు పండించి పెట్టిందని, పెడుతోందని వెల్లడి చేస్తున్నాయి.

బీమా కంపెనీలు రైతుల క్లెయిమ్‌లను పరిష్కరించి, నష్టపరిహారాన్ని సక్రమంగా చెల్లించ ట్లేదనీ, క్లైమ్‌ల పరిష్కారంలో ఎనలేని జాప్యాన్ని చేస్తున్నాయని, ఆఖరుకు పరిష్కరించినా రైతులకు నామమాత్రపు నష్టపరిహారాన్ని కూడా చెల్లించట ల్లేదనీ, ఛత్తీస్‌ఘడ్‌రాష్ట్రం- రాయగడ్‌జిల్లాలోనూ, కొన్ని యితర రాష్ట్రాలలోనూ బీమా కంపెనీలు ఒక్కో రైతుకు కేవలం రు.5/- నుండి రు.18/- వరకూ విలువగల చెక్కులను నష్టపరిహారంగా పంపించి రైతులతో క్రూరపరిహాసం ఆడుతున్నాయనే రిపోర్టులు వెల్లడవుతున్న ప్రస్తుత తరుణంలో, వ్యవసాయమంత్రిత్వశాఖ వెల్లడించిన వివరాలు అసలు విషయాన్ని బయటపెడుతున్నాయి.

అతి తక్కువ ప్రీమియంతో అంటే ఖరీఫ్ పంటలకు 2 శాతం ప్రీమియంరేటు, రబీపంటలకు 1.5 శాతం ప్రీమియంరేటు, ఉద్యానవన-వ్యాపార పంటలకు 5 శాతం ప్రీమియంరేట్లుగా అతితక్కువ ప్రీమియం రైతులు చెల్లించి, గరిష్టమైన పంట నష్టపరిహారం పొందవచ్చునని-యీ పథకం గురించి ప్రచారం చేయబడింది.

ఐ.సి.ఐ.సి.ఐ-లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ, హెచ్.డి.ఎఫ్.సి-ఎర్గో జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ, ఇఫ్‌కో-టోకియో జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్, చోళమండలం ఎం.ఎస్.జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్, టాటా-ఎ.ఐ.జి. జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్, ఫ్యూచర్ జనరల్ ఇండియా ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్, బజాజ్ ఎవైయన్జ్ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీలు లాంటి కొన్ని కంపెనీలు యీ ప్రధానమంత్రి ఫసల్ భీమాయోజన పథకంక్రింద పంట ఇన్సూరెన్సులు కట్టించుకోవటానికి ప్రభుత్వం నుండి అనుమతి పొందాయి.

పంట ఇన్సూరెన్సు ప్రీమియంకు వేలంపాట పాడి యీ అనుమతులు దక్కించుకొన్నాయి. వాస్తవానికి ప్రపంచంలో మరెక్కడా, మరే దేశంలో కానీ పంట ఇన్సూరెన్సు ప్రీమియంను వేలంపాట పద్ధతిద్వారా నిర్ణయించే పద్ధతి లేనేలేదు. ప్రపంచ మంతటా ప్రభుత్వాలే పంట ఇన్సూరెన్సు ప్రీమియంను నిర్ణయించే పద్ధతే అమలు జరుగుతోంది. మన దేశంలో మాత్రమే ఎన్.డి.ఎ. పాలకులు యీరకంగా ఇన్సూరెన్సు కంపెనీలే వేలంపాట(బిడ్)ద్వారా ఇన్సూరెన్సు ప్రీమియం నిర్ణయించే పద్ధతిని నెలకొల్పి అమలుచేస్తున్నారు.

ఈ నూతన విధానంయొక్క అంతరార్థం- వాస్తవ నిజస్వరూపాన్ని - కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ వెల్లడించిన ఒక చిన్న వివరం బట్టబయలుచేస్తోంది.

2016-17 సంవత్సరకాలంలో యీ ప్రైవేటు కంపెనీలకు మొత్తంగా చెల్లించబడ్డ పంటల భీమా ప్రీమియం మొత్తం 22,180 కోట్ల రూపాయలు. (ఇందులో రైతులు 4,883 కోట్లు ప్రీమియంగా చెల్లించగా, 17,796 కోట్ల రూపాయలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రీమియంగా చెల్లించాయి). ఈ ప్రీమియం మొత్తంనుండి, దేశంలోని రైతులకు ఆ ప్రైవేటు ఇన్సూరెన్సు కంపెనీలు నష్టపరిహారంగా 1.20 కోట్ల రైతులకు చెల్లించిన నష్టపరిహారమొత్తం 12,949 కోట్ల రూపాయలు. అంటే సగటున ఒక రైతుకు 1,077/- రూపాయలకు లోపలే పంట నష్టపరిహారం అన్నదాన్ని చెల్లించాయన్నమాట! అంటే ప్రైవేటు ఇన్సూరెన్సు కంపెనీలకు ఈ పథకం ద్వారా 2016-17 సంవత్సరానికి వచ్చిన లాభం 9,231 కోట్ల రూపాయలు. వాస్తవానికి ప్రీమియం రేటుకూడా ప్రకటించినట్లుగా 2% నుండి 5% కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించిన ప్రీమియం మొత్తాలతో కలిపి చూస్తే అది 12 నుండి 15 శాతంగా వుంది.

అంతేకాదు, ఆ ప్రైవేటు కంపెనీలు ప్రతీఏటా ప్రీమియం రేటును పెంచుకొంటూపోతున్నాయి. 2016-17 సంవత్సర కాలంలో అవి అదనంగా 5 నుండి 10శాతం దాకా ప్రీమియం రేటును వసూలు చేశాయి. ఒకవైపు యీ పథకంలోకి చేరే రైతుల ఎన్‌రోల్‌మెంటు సంఖ్య తగ్గిపోతూ వుండగానే, కంపెనీలు వసూలు చేసే ప్రీమియం మొత్తాలు పెరిగిపోతుండటమన్నది గమనార్హమైన అంశం. బ్యాంకులు రైతులకు అప్పులివ్వటాన్ని తగ్గించటంవలన, బీమాకోసం నమోదు చేసుకొనే సభ్యులసంఖ్య తగ్గుతోందన్నది మరో గమనార్హమైన అంశం. అయినా ప్రైవేటు ఇన్సూరెన్సు కంపెనీలకు చెల్లింపబడే ప్రీమియం మొత్తాలు రోజురోజుకూ పెరిగిపోతూనే వున్నాయి. బ్యాంకులనుండి వ్యవసాయ రుణాలు తీసుకొనే రైతులనుండి బ్యాంకులు ఆటోమేటిక్‌గా యీ పథకం క్రింద ప్రీమియంను రుణంనుండి కోతకోసుకొని, మిగిలిన మొత్తాన్నే ఇస్తున్నాయి.

ఈ వివరాలను పరిశీలిస్తే యీ పథకం రైతుల మేలుకోసం చేపట్టబడి రూపొందించబడింది కాదనీ, ప్రైవేటు ఇన్సూరెన్సు కంపెనీలకు లాభాలు సమకూర్చిపెట్టడానికే రూపొందించబడి అమలు జరుపబడుతోందని, అప్పు తీసుకునే రైతు అంగీకారంతో

నిమిత్తం లేకుండా యిన్సూరెన్సు ప్రీమియం మొత్తాలను కోతబెట్టడానికి సాధనాలుగా యిందుకు ఏజెంట్లుగా బ్యాంకులు వాడుకోబడు తున్నాయనీ అర్ధమవుతోంది.

రైతుకు నేరుగా సబ్సిడీలు, రాయితీలు చెల్లించే పద్ధతిలో అక్రమాలు, అవినీతి జరుగు తున్నందువలన నేరుగా ఆయా కంపెనీలకే సబ్సిడీ/రాయితీ మొత్తాలను చెల్లించి రైతుకు మేలు చేస్తున్నామనే విధానాలను పాలకులు అమలు జరపటం ఎంతకాలంగానో సాగుతూనే వుంది. ఎరువుల సబ్సిడీని రైతుకు చెల్లించకుండా నేరుగా కంపెనీలకు చెల్లించే విధానం అమలుజరుప బడుతూ, రైతుకు మేలు చేకూర్చకపోగా, ఆయా ఎరువుల కంపెనీలకు లక్షలకోట్లు సబ్సిడీ మొత్తాలను దోచిపెడ్తూ, అనేక అక్రమాలు–అవినీతి జరుగుతున్న అనుభవం మనముందు కావల్సినంత వుండనే వుంది.

ఇప్పుడు బీమా (పంటల) పేరిట, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు యిచ్చే సబ్సిడీ ప్రీమియం మొత్తాలను ప్రైవేటు ఇన్సూరెన్సు కంపెనీలకు దోచిపెట్టే విధానాన్ని 'ప్రధానమంత్రి ఫసల్ యోజన పథకాన్ని' ఎన్.డి.ఏ. పాలకులు అమలుజరుపుతున్నారు.

అసంఘటితరంగ కార్మికులకు ఇన్సూరెన్సు పథకాలు, పెన్షన్ పథకాల ద్వారా జరుగుతున్నది కూడా యిదే రకమయిన కైంకర్యం.

బాధితులను ఆదుకొనే పేరిటే ఆ బాధితుల నుండి మొత్తాలను సేకరించి, ఆ మొత్తాలను ప్రైవేటు కంపెనీలకు దోచిపెట్టడమన్నది సామ్రాజ్యవాద ప్రపంచీకరణయొక్క సరళీకరణ ఆర్ధిక విధానాలకు మూలసూత్రంగా వుందన్న విషయాన్ని, యీ ప్రధానమంత్రి ఫసల్ యోజనా పథకం అమలుయొక్క అనుభవాలు మరోసారి నిర్ధారిస్తున్నాయి.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ సంస్కరణలను తలకెత్తుకొని దేశంలో అమలుజరుపుతున్న మన పాలకుల–వారి పథకాల స్వభావాలను, నాటకాలను, మోసాలను యీ సందర్భంగా వివిధ రైతు సంఘాలతోపాటు, యితర ప్రజాసంఘాలు కూడా గుర్తించి, స్పష్టంగా అర్ధంచేసుకోవాలి. పాలకులు ఆడుతున్న ఈ సంస్కరణల బూటకాన్ని సమర్ధవంతంగా ఎదురించి, నిలువరించగల ఉద్యమాన్ని నిర్మించే సత్వర చర్యలు చేబట్టడానికి పూనుకోవాలి.

బిబిబిబి